**కథ**

# విలువలు

**సి.జయాబాలకృష్ణ**

సాయంకాలం సమయం. బయట కుర్చీ వేసుకుని కూర్చున్నాడు శ్రీకర్. ఉద్యోగ విరమణ అయి కూడా రెండు సంవత్సరాలైంది. కూడు, గూడు, నీడ, వాటికి కావల్సిన డబ్బు కొరకూ ఇబ్బంది లేదు. భార్య లక్ష్మి అనుకూలంగా ఉంటుంది. ఒక్కగానొక్క కూతురు. ఇంజనీరింగు పూర్తి చేసింది. ఓ పెద్ద ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. కూతురికి పెళ్లి చేయాలనే ప్రయత్నంలో ఉన్నాడు శ్రీకర్.

కూతురికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఆ ప్రయత్నంలోనే తన గతం కళ్ల ముందు మెదిలింది. అప్పట్లో తనకి ఆశ్చర్యంగానూ ఉండేది. కొంత.. బాధగానూ ఉండేది. ఆలోచనలతో గతంలోకి వెళ్లిపోయాడు శ్రీకర్....

* * *

శ్రీకర్‌కి అది పదహారోదో లేకపోతే ముప్పై ఆరోదో పెళ్లిచూపులు.

"ఏరా శ్రీ! ఎంతసేపురా! త్వరగా రావాలి. ఆలస్యం అవుతున్నది" శ్రీకర్ తండ్రి రామారావుగారు బయట వరండాలో నిలబడి కొడుకుని పిలిచారు. శ్రీకర్ తల్లి కమలమ్మ పట్టుచీర కట్టుకుని నిండుగా ముస్తాబై కొడుకు కోసం చూస్తున్నది.

'ఏమిటో... ఈ పెళ్లి చూపులైనా, పెళ్లి కుదిరితే బాగుండును!' అనుకున్నాడు శ్రీకర్ ముస్తాబు చేసుకుంటూ.

'పెళ్లి చూపులు' అంటే మొదట్లో సరదాగా, హుషారుగానే ఉండేది. కానీ రానురానూ విసుగ్గానే అనిపిస్తున్నది. 'తనకి పెళ్లి చెయ్యాలి' అని తన అమ్మా, నాన్న అనుకున్నప్పుడు ఆ నిర్ణయం... తనకి పెళ్లి సంబంధాలు చూడటం, కుటుంబాల మంచిచెడులూ లాంటి విషయాలు వాళ్లకే వదిలేశాడు.

వాళ్లు తనకి పెళ్లి సంబంధం చూడటం, తనని పెళ్లి చూపులకి తీసుకువెళ్లటం రానురానూ యాంత్రికమైపోయింది.. ఆఖరిసారి అద్దంలో ముఖం చూసుకుని 'తను బాగానే ఉన్నాడు మన్మథమొలకలా' అనుకున్నాడు మురిసిపోతూ. మెట్లు దిగి కిందికి వచ్చాడు.

అందరూ కారు ఎక్కాక కారు బయలుదేరింది.

రామారావుగారు డబ్బు బాగానే ఉన్నవాడు. ఆస్తిపాస్తులు బాగానే ఉన్నాయి. సివిల్ ఇంజనీర్‌గా గవర్నమెంటు ఉద్యోగం చేసి బాగానే సంపాదించి, రిటైరు అయినాడు రెండు సంవత్సరాల క్రితమే. శ్రీకర్ ఆయనకి ఒక్కగానొక్క కొడుకు. శ్రీకర్ బి.కామ్ డిగ్రీచేసి, ఆ తరువాత ఎం.బి.ఎ చేసి, ఓ మంచి ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. అయిదు అంకెల జీతం.

అమ్మాయి ఇల్లు వచ్చింది. పెళ్లికూతురి తండ్రి అందరినీ లోపలికి ఆహ్వానించాడు. 'పెళ్లికూతురు వాళ్లు కూడా ఉన్నవాళ్లే' అనిపించింది రామారావుగారికి ఆ ఇంటినీ, పరిసరాల్నీ చూసి.

పలకరింపులూ, పరిచయాలూ, మర్యాదలూ అయినాయి. కాఫీలూ, ఫలహారాలూ అవుతున్నాయి.

అమ్మాయి వచ్చి కూర్చుంది. వాతావరణంలో కాస్త నిశ్శబ్దత చోటు చేసుకుంది.

'అమ్మాయి బాగానే ఉంది. ఫరవాలేదు' అనుకున్నాడు శ్రీకర్.

తను 'మన్మథమొలక' అనుకున్నాడు గానీ ఈ అమ్మాయి మాత్రం రంభా, ఊర్వశి కాదు. కానీ బాగుంది. అనాకారి మాత్రం కాదు.

అమ్మాయి పేరు అడిగింది కమలమ్మగారు. 'రాణి' అని చెప్పింది అమ్మాయి. చదువూ, వివరాలూ అడిగింది. ఎం.ఎ. చేసింది. సంగీతం కొద్దిగా నేర్చుకుంది. 'ఫరవాలేదు... అన్నీ బాగానే ఉన్నాయి' అనుకున్నారు.

"నేను ఆ అమ్మాయితో మాట్లాడాలి కొద్దిగా...." అన్నాడు శ్రీకర్ కాస్త మొహమాట పడుతూనే.

"ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే.... ఇలాంటి పెళ్లి చూపుల్లో" అన్నాడు మధ్యవర్తి. పక్కనే ఉన్న గదిలోకి వెళ్లారు ఇద్దరూ.

వాళ్ల హాబీలూ, అలవాట్లూ, ఇష్టాయిష్టాలూ ఒకరికొకరు మాట్లాడుకున్నారు.

"చివరిగా ఒక ముఖ్య విషయమండీ రాణీగారూ!" అన్నాడు శ్రీకర్.

"చెప్పండి" అన్నది రాణి.

"మా అమ్మా, నాన్నకి నేను ఒక్కడినే కొడుకుని. నాకు భార్యగా వచ్చే అమ్మాయి వాళ్లని ప్రేమగా, గౌరవంగా చూసుకోవాలి. నా కారణంగా, నా భార్య కారణంగా ఇంట్లో గొడవలూ, కీచులాటలూ - వాళ్లు బాధపడటం, నేను బాధపడటం - ఇలాంటివన్నీ నాకు ఇష్టం లేదు" అన్నాడు.

మౌనంగా వింటూ కూర్చుంది.

"ఏమిటి మౌనం వహించారు?"

"ఇది మీ అభిప్రాయమా? లేక మీ అమ్మా, నాన్న అభిప్రాయమా?" అడిగింది.

"నా అభిప్రాయమే. నేను ఇలా అడుగుతున్నట్లు కూడా వాళ్లకి తెలియదు."

"అంటే... మీ పెళ్లి జరిగాక కూడా మీరు మీ అమ్మా, నాన్నల దగ్గరే ఉండాలనుకుంటున్నారా?"

"అదేమిటి! అలా అడుగుతున్నారు? నేను వాళ్ల దగ్గర ఉండక, మరెక్కడ ఉంటాను?"

"మీ పెళ్లి అయిన తరువాత మీ జీవితం మీది, వాళ్ల జీవితం వాళ్లది. ఎవరికి ఉండాల్సిన స్వేచ్ఛాస్వాతంత్ర్యం వాళ్లకి ఉండి తీరాలి. మీరు ఏ అమెరికాయో వెళ్లితే, వాళ్లు ఒంటరిగా ఉండాల్సిందేగా!" అన్నది.

రాణి ధోరణి శ్రీకర్‌కి అంతగా నచ్చటం లేదు.

"రాణీగారూ! నేను అమెరికా వెళ్లే ప్రశ్నే లేదు. ఒకవేళ వెళ్లినా ఒక నెల, రెండు నెలలకి మించి ఉండను. వాళ్ల కోసమే నేను ఈ చదువూ, ఈ ఉద్యోగం చూసుకున్నాను. సరే... మీ అభిప్రాయం చెప్పండి"

"పెళ్లి అయిన తరువాత ఎవరి స్వేచ్ఛ వాళ్లకి ఉండాలి. మా నాన్న నాకు మంచి ఇల్లు ఇస్తాడు. పెళ్లి తరువాత నేనూ నా భర్తా మాత్రమే ఉండాలి. ఈ పెద్దవాళ్లూ, వాళ్ల చేదస్తాలూ, అథారిటీలూ.. అవన్నీ నాకు నచ్చవు."

"అయితే... వాళ్లకి వయసు మళ్లి, శక్తి లేకపోతే అనారోగ్యం వస్తే- ఎవరు చూసుకుంటారు?"

"అనారోగ్యం వస్తే నర్సింగ్ హోమ్స్ ఉన్నాయి. వయసుమళ్లితే ఓల్డేజ్ హోమ్స్ ఉన్నాయి. డబ్బు ఖర్చు పెడితే- ఈ రోజుల్లో అన్నీ అందుబాటులోనే ఉన్నాయి" అన్నది రాణి.

శ్రీకర్‌కి ఆశ్చర్యంగా ఉంది రాణి ధోరణి. "మరి... మీ అమ్మా, నాన్న విషయంలో కూడా మీరు ఇలాగే ఆలోచిస్తున్నారా?"

"అవును.. మా అన్నయ్యకి కూడా ఇదే అభిప్రాయం. పెళ్లి అయిన తరువాత వాడు కూడా విడిగానే కాపురం ఉంటాడు" రాణి మాటలు దృఢంగా ఉన్నాయి.

శ్రీకర్‌కి ఆశ్చర్యంతో పాటు అయోమయంగా కూడా అనిపించింది. నోట్లో నుంచి కాసేపు మాట రాలేదు.

"మీరు కూడా ఆలోచించి మీకు ఇదే అభిప్రాయం ఉంటే లేకపోతే మీ అభిప్రాయం మార్చుకుంటే- మీతో పెళ్లికి నాకు అభ్యంతరం ఉండదు" స్పష్టంగానే చెప్పింది రాణి.

శ్రీకర్ రాణి మాటలకి ఆలోచనలో పడ్డాడు. 'ఇది ఎన్నో పెళ్లిచూపులో! వందకి తక్కువ యాభైకి ఎక్కువ.. ఈ అమ్మాయి కూడా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పింది. తనే నిర్ణయం తీసుకోవాలి'

శ్రీకర్ వైపు చూసింది రాణి. బహుశః అతను ఏం సమాధానం చెబుతాడా అని.

"నేను ఆలోచించుకుని మీకు త్వరలోనే నా నిర్ణయం తెలియజేస్తాను" అని లేచాడు.

"మీరు నాకు నచ్చారు. పాజిటివ్‌గా ఆలోచిస్తే బాగుంటుంది" అన్నది.

చిన్నగా నవ్వాడు శ్రీకర్.

ఆఖరి మాట అన్నది... "మీరు మీ అమ్మా నాన్న కూచి అనుకుంటాను. మీకు మీ అమ్మా, నాన్న అంటే అంత ఇష్టమా?" అని.

మరొకసారి నవ్వాడు. "అందులో అసహజమేమీ లేదుగా!" అన్నాడు నవ్వుతూనే.

★ ★ ★



"ఆ అమ్మాయితో మాట్లాడి, నవ్వుతూ బయటికి వస్తే ఈ సంబంధం ఒప్పుకుంటావనుకున్నాను. ఏమిటిరా శ్రీ? ఎన్ని సంబంధాలు చూసినా, ఏదో ఒక వంక పెట్టి కాదంటావు. పెళ్లిచూపుల్లో అమ్మాయిలతో మాట్లాడుతావు. ఏం మాట్లాడుతావు? ఒక్క సంబంధమూ నీకు నచ్చటం లేదు. మళ్లీ పెళ్లి సంబంధాలు మమ్మల్నే చూడమంటావు. నీ సంగతి ఏం అర్థం కావటం లేదు. ఈ రాణితో మాట్లాడావు. అమ్మాయి కూడా బాగుంది. వాళ్ల కుటుంబమూ బాగుంది. ఎందుకు నచ్చలేదు?" రామారావుగారు అడిగారు.

కారణం చెబితే - వీళ్లు తేలిగ్గా కొట్టిపారేస్తారు. తన మాట అసలు వినిపించుకోరు. కానీ తనకి అదే ముఖ్యమైన విషయం. ఎన్ని పెళ్లిచూపులు చూశాడు! తను చూసి అమ్మాయిలందరిదీ ఇదే ధోరణి, ఒకే ధోరణి. మళ్లీ వాళ్లకీ పెద్దలు నిర్ణయించిన పెళ్లే కావాలి.

"పెళ్లి అంటే ఇద్దరి జీవితాలే కాదు రెండు కుటుంబాల కలయిక" అని అనుకోవటం లేదు. 'నా జీవితం-నా మొగుడు' అనుకుంటున్న తను చూసిన అమ్మాయిలు.. మానవ సంబంధాల విలువలు అణగద్రొక్కేస్తున్నారు. "నేనూ నాదీ" అని స్వార్థం పెంచుకుంటున్నారు. మొగుడ్ని కన్న తల్లితండ్రులు అవసరంలేదు. వాళ్ల కష్టసుఖాలూ అవసరం లేదు. ఆ అమ్మాయి స్వభావం ముందుగా తెలిసి, ఎలా తను పెళ్లికి ఒప్పుకోవటం.. ఈనాటి కాలంలో తను కావాలి అనుకున్న స్వభావం ఉన్న అమ్మాయి ఎప్పుడు దొరుకుతుందో...!

"ఏమిటిరా శ్రీ మాట్లాడవు? నాన్న మాట్లాడుతూ ఉంటే అలా బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడవు!" కమలమ్మ అన్నది కొడుకుతో.

"బెల్లం కొట్టిన రాయి అంటే ఏమిటమ్మా?" అడిగాడు నవ్వుతూ.

"ఇదిగో.. నువ్వే! అడిగిన దానికి సమాధానం చెప్పకుండా ఆకాశం వంక చూస్తున్నావు కదా! చూడు... బ్రహ్మాచారి ముదిరినా, బెండకాయ ముదిరినా ఎందుకూ

పనికిరావుట." అన్నారు రామారావుగారు.

"నాన్నా...! బెండకాయ ముదిరితే పనికి రాని మాట నిజమే. కొయ్యలాగా ఉంటుంది కదా! కానీ... బ్రహ్మ చారి అంత ఘోరం కాదు నాన్నా! ఫరవాలేదు... పనికివ స్తాడు" నవ్వుతూ అన్నాడు.

"నీ పెళ్లి చేసేటప్పటికి నేను సహస్ర చంద్ర దర్శనం చూస్తాను"

"అంటే... ఏమిటి నాన్నా?" అమాయకత్వం నటిం చాడు.

"అంటే నా వయసు ఎనభై రెండు సంవత్సరాలు కూడా దాటుతుంది" విసుగ్గా అన్నారు రామారావుగారు.

"ఫో నాన్నా! మరీ అంత ఆలస్యం అవదులే"

"నీకు అంతా వేళాకోళంగా ఉంది. ఆడపిల్లల్ని చూసి రావటం, ఆ తరువాత కాదని చెప్పటం... నాకు చాలా కష్టంగా ఉంది" అన్నారు.

"ఆలోచిద్దాం నాన్నా పరిష్కారం. నా పెళ్లే కదా!" నవ్వుతూ లేచాడు అక్కడి నుంచి.

★ ★ ★

సాయంత్రం అయిదు గంటలు దాటింది. ఆకాశం మేఘావృతమైంది. వర్షం పడుతున్నది. ఆఫీసు వరం డాలో నిలబడి చూస్తున్నాడు శ్రీకర్, తను కారు దగ్గరికి వెళ్లేసరికి తడిసిపోతానేమో అనుకుంటూ.

అలా పక్కకి చూశాడు. ఆ వరండాలో కొంచెం పక్కగా ఓ బాపూ బొమ్మ నిలబడి ఉంది. బాపూ బొమ్మలా పదహారేళ్ల వయసు కాదు ముప్పై లోపు ఉంటుందేమో. బహుశః ఆమె కూడా వర్షంలో వెళ్లటా నికి ఆలోచిస్తూ నిలబడిందేమో!

దగ్గరికి వెళ్లాడు శ్రీకర్. "ఎక్స్క్యూజ్‌మీ! నేను శ్రీకర్. మీరు... మీరు ఈ వర్షం గురించే నిలబడ్డారా?" అడి గాడు.

"నమస్తే... నా పేరు లక్ష్మి. ఈ వర్షం తగ్గుతుందే మోనని నిలబడ్డాను" అన్నది. శ్రీకర్‌ని తన గదిలో కూర్చుని పని చేసుకుంటూ ఉంటే చూసింది లక్ష్మి.

"మీరు కొత్తగా చేరారా?"

"అవునండీ! రెండు నెలలు అవుతున్నది"

రెండు మూడు నిముషాలు చూసి "ఈ వర్షం ఇప్పట్లో తగ్గేటట్లు లేదు. ఉండండి.. కారు తెస్తాను" అని వర్షంలోనే నడిచి వెళ్లి, కారు తీసుకుని వచ్చాడు.

"రండి.... ఎక్కండి" అన్నాడు కారులోనుంచే.

"థ్యాంక్స్! వద్దండీ.. నేను వెళ్తాను బస్సులో"

"ఈ వర్షం ఇప్పుడే తగ్గేటట్లు లేదు. మీ చేతిలో గొడుగు కూడా లేదు. రండి.. ఒకళ్లకొకళ్లు సహాయం. అంతే.." అన్నాడు.

శ్రీకర్ మాట తీరుకి ఇంకేం మాట్లాడలేక, కారు ఎక్కి కూర్చుంది లక్ష్మి.

"ఎక్కడికి వెళ్లాలి?" డ్రైవ్ చేస్తూనే అడిగాడు.

"వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి" అన్నది.

ఒకసారి లక్ష్మి వంక చూశాడు డ్రైవ్ చేస్తూనే. "అంటే?"

"నేను అక్కడే ఉంటున్నాను" ముక్తసరిగా అన్నది.

మాట్లాడకుండా లక్ష్మిని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ దగ్గర దింపి వెళ్లిపోయాడు.

★ ★ ★

వర్షం నాటి పరిచయం శ్రీకర్‌కి, లక్ష్మికి ముందుకు సాగింది. ఇద్దరికీ పాతికేళ్ల వయసు దాటి ఊహలూ, ఉద్రేకాలూ, కోరి కలూ... కొద్దిగా దాటి, స్థిమితంగా ఆలోచించే వయసుకి వచ్చారు.

తన గురించి పూర్తిగా చెప్పుకున్నాడు శ్రీకర్. తన గురించి చెప్పుకుంది లక్ష్మి. లక్ష్మి పదేళ్ల వయసులో తల్లీ, తండ్రీ చనిపోయారు. గత్యంతరం లేక మేనమామ తీసు కువెళ్లాడు. తన తల్లిదండ్రుల డబ్బూ, ఉన్న కొద్ది పొలమూ తీసుకున్నాడు. లక్ష్మిని ఓ డిగ్రీ వరకూ చదివిం చాడు. మేనమామ ఇంట్లో చాలా కష్టపడే పెరిగింది లక్ష్మి.

లక్ష్మికి డిగ్రీ పూర్తి అవుతూనే "ఏదో ఒక ఉద్యోగం చూసుకో. నిన్ను చదివించటం, పోషించటం నా వల్ల కాదు. నీ బ్రతుకు నువ్వు బ్రతుకు" అన్నాడు మేనమామ.

లక్ష్మి తన స్నేహితురాలి తండ్రి సహాయంతో ఓ ఉద్యోగంలో చేరిపోయింది. మేనమామ, అత్తవాళ్లు కొడుకూ, కోడలి దగ్గరకి వెళ్లిపోయారు. అప్పటి నుంచీ ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టలే తనకి నీడని, రక్షణని ఇస్తు న్నది. ప్రైవేటుగా ఎం.ఎ. చేసింది. ఏవో చిన్న చిన్న కంప్యూటర్ కోర్సులు చేసింది. ఈ కంపెనీలో ఉద్యో గంలో చేరింది ఈమధ్యనే. జీతం ఎక్కువ. ఒంటరిగా ఉండలేక హాస్టల్‌లోనే ఉంటున్నది. ఈమధ్యనే తన స్నేహి తురాలు రాధ అడిగింది. "వేరే ఇల్లు తీసుకుని ఉందాం లక్ష్మి!" అని. తన గురించి చెప్పింది లక్ష్మి.

"మీ మావయ్య మిమ్మల్ని దారుణంగా మోసం చేశారు.

## తనకి తనే పోటీ?

**అక్కలు సినిమాల్లో సెటిలయ్యాక చెల్లెళ్లు రంగప్రవేశం చేయడం కొత్తేమీ కాదు. కొండొకచో ఈ అక్కలకు ఆ చెల్లెళ్లే పోటీ అయిన సందర్భాలూ లేకపోలేదు. తాజాగా ఓ అక్క- తన చెల్లెల్ని సినిమా తారను చేస్తోంది. టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన గోవా భామ ఇలియానా- తన చెల్లెల్ని హీరోయిన్‌ని చేసే ప్రయత్నాల్లో బిజీగా వుందిట ఇప్పుడు. మరి ఆమె సోదరి ఆమెకే పోటీ అవుతుందో, ఇతరులకు పోటీ అవుతుందో వేచి చూద్దాం.**



చాలా అన్యాయం"

"నేను అలా అనుకోనండీ! డబ్బు తీసుకుని, పిల్లల్ని అనాథశరణాలయాల్లో చేర్పించి, తప్పుకునే వాళ్లు ఎంతో మంది. మా మావయ్య డబ్బు తీసుకున్నా నన్ను భరించాడు. ఇంట్లో చాకిరీ చేయిస్తూ, ఆ పిల్ల మంచి చెడ్డలూ, చదువు సంధ్యలు పట్టించుకోని వాళ్లు, సరిగ్గా తిండి కూడా పెట్టనివాళ్లు కూడా ఉన్నారు. మావయ్య ఇంట్లో చాకిరీ చేయించినా చదువు చెప్పించాడు. తన ఇంట్లో ఉండనిచ్చాడు. నాకు ఏదో ఒక ఉద్యోగం వచ్చేవ రకూ నన్ను భరించాడు. నాకు ఉద్యోగం వచ్చిన తరువాత, 'ఇంక నీ బ్రతుకు నీది' అని తప్పుకున్నాడు. జరిగిన దానిలో ఎంతో కొంత మంచే జరిగింది" అన్నది.

"హ్యాట్సాఫ్ అండీ!"

"ఎందుకు?"

"మీ పాజిటివ్ థింకింగ్‌కి" నవ్వాడు.

★ ★ ★

ఆ రోజు లక్ష్మిని ఇంటికి తీసుకువచ్చాడు శ్రీకర్.

రామారావుగారూ, కమలమ్మ లక్ష్మిని బాగానే పలకరించారు. లక్ష్మి వివరాలు అన్నీ అడిగారు. తన గురించి అన్నీ చెప్పింది. "అయ్యో! అలాగా!" సానుభూతి కలిగింది ఇద్దరికీ. టీలూ, మర్యాదలూ అన్నీ అయినాయి. కాసేపు కూర్చుని వెళ్లిపోయింది లక్ష్మి.

లక్ష్మి వెళ్లిపోయిన తరువాత "నాన్నా! నేను లక్ష్మిని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు శ్రీకర్.

శ్రీకర్ తన గురించి చెప్పినప్పుడు "నేను తప్పకుండా మీతో సహకరిస్తాను" అన్నది లక్ష్మి మనస్ఫూర్తిగా.

"ఏమిటీ! ఆ తాడూ, బొంగరం లేని పిల్లనా?" కమలమ్మ గయ్యిమన్నది.

"అంటే?"

"అంటే నా! తల్లీ తండ్రీ లేరు. నా అనేవాళ్లు లేరు. డబ్బు లేదు. ఎక్కడో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నది. ముప్పై ఏళ్ల వయసు. ఆ అమ్మాయి మంచీ చెడులు అన్నీ మన నెత్తిన పడతాయి."

"అమ్మా! తల్లీ, తండ్రీ లేకపోవడం ఆ అమ్మాయి తప్పు కాదు. డబ్బు మనకి ఉన్నది. మన ఇంటికి వచ్చాక మనమంతా ఆ అమ్మాయికి కావల్సిన వాళ్లమే కదా! ఇంక వయసు అంటావా! అమ్మా! నీ కొడుకు చిన్నవాడా? నాకు ముప్పై రెండేళ్లు. లక్ష్మి చాలా మంచి పిల్ల. అర్థం చేసుకునే సంస్కారం ఉంది" అన్నాడు.

"ఎన్నో మంచి సంబంధాలూ, చక్కని అమ్మాయిల్నీ చూపిస్తే నీకు నచ్చలేదు. నువ్వు ఇప్పుడు ఈ అనాథని చేసుకోవటం మాకు ఇష్టం లేదు." ముక్తకంఠంతో అన్నారు ఇద్దరూ.

"సరే..." మరో మాట మాట్లాడలేదు శ్రీకర్.

ఆరు నెలల కాలం గడిచిపోయింది.

ఒకరోజు... కమలమ్మగారికి చిన్నగా గుండెనొప్పి వచ్చింది. హాస్టల్‌లో చేర్పించారు. ఐ.సి.యు.లో ఉంచారు మూడు రోజులు. ఆ తరువాత వారం రోజులు రూములో ఉంచారు. పరీక్షలన్నీ చేశారు. ప్రాణాపాయం తప్పింది. ఫరావలేదు అన్నారు డాక్టర్లు. కమలమ్మ మరో నాలుగు రోజులు ఉండి ఇంటికి వచ్చింది. చుట్టాలమూ, తెలిసినవాళ్లూ హాస్పిటల్‌కి వచ్చి చూసి వెళ్లినవాళ్లే గానీ, ఎవరూ ఉండి ఆవిడకి సహాయం చేయలేదు. ఆఫీసుకి సెలవు పెట్టి శ్రీకర్ చూసుకున్నాడు. కమలమ్మ హాస్పిటల్‌లో ఉన్నన్ని రోజులూ, ఆఫీసుకి సెలవు పెట్టి, లక్ష్మి ఆవిడకి తోడుగా ఉంది. ఆవిడకి కావల్సినవన్నీ జాగ్రత్తగా చూసుకుంది.

లక్ష్మి ఆవిడతో ఉన్నన్ని రోజులూ కమలమ్మ, రామారావుగారి ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఎంత మంచి పిల్ల! ఎంత ఓర్పు! ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. శ్రీకర్ చెప్పింది అబద్ధం కాదు. తాము ఏ పిల్లని చూపించినా వద్దని చెప్పేవాడు. ఇప్పుడు వాడు పిల్లని చూసి, పెళ్లి చేసుకుంటానంటే తాము వద్దనటం ఎంతవరకూ న్యాయం?

కమలమ్మ, రామారావుగారూ ఆలోచించుకుని, ఒక నిర్ణయానికి వచ్చారు. ఫలితంగా - శ్రీకర్, లక్ష్మిల పెళ్లి జరిగిపోయింది.

పెళ్లి తరువాత, పది రోజులైనా ఆఫీసుకి వెళ్లని లక్ష్మిని అడిగింది కమలమ్మ.

"లక్ష్మి! ఆఫీసుకి వెళ్లటం లేదు. ఎప్పటివరకూ శలవు



పెట్టావు?" అని.

"సెలవు పెట్టలేదు అత్తయ్యగారూ! ఉద్యోగం మానేశాను." అన్నది.

"ఉద్యోగం మానేశావా?"

"అవును. ఇప్పుడు నాకు ఉద్యోగం అవసరం కన్నా, నా అవసరం మీకు ఉంది. మిమ్మల్ని చూసుకోవాలి. నాకు అమ్మా, నాన్నా లేరు. మీరు కావాలి నాకు. మీరు పెద్దవాళ్లు. మీరు విశ్రాంతి తీసుకోండి. మీకు ఏమి కావాలన్నా, నేను చూసుకుంటాను మీకు" అన్నది.

లక్ష్మి మాటలకి రామారావుగారికీ, కమలమ్మకీ మనసు ఆర్ద్రమైంది. "ఇటువంటి పిల్లలు కూడా ఉన్నారా! తమ కోసం ఉద్యోగం మానేసింది. శ్రీకర్ నిర్ణయం ఎంత మంచి నిర్ణయం!.." అనుకున్నారు.

"ఇటువంటి అమ్మాయి కోసమేనమ్మా నేను ఇన్నాళ్లూ ఎదురుచూసింది. ఇప్పుడు చూడు! ఇంట్లో ఎంతో ప్రశాంతంగా, అందరం సంతోషంగా ఉన్నామో!" అన్నాడు.

"నిజమే రా శ్రీ! ఏవేవో గొప్పలూ, భేషజాలూ, ఇగోలూ, ఆస్తులూ, అంతస్తులూ... డబ్బు ఉన్నా కూడా డబ్బంటే ఆశ! ఏవో చాదస్తాలు... అన్నిటికంటే మనం ఏదో గొప్ప అయినట్టు, కోడలుగా మన ఇంటికి వచ్చే ఆడపిల్ల అంటే చులకన, అయిష్టం" అన్నది కమలమ్మ.

నవ్వాడు శ్రీకర్, "అమ్మా! నువ్వు కూడా బాగానే ఆలోచిస్తావు. ఇంకొక్క విషయం చెప్పనా? ఇప్పటివరకూ నువ్వే లోకంగా తిరిగిన నీ కొడుకు, నీ చేతిలో నుంచి జారిపోయి, కోడలుగా వచ్చిన పరాయి అమ్మాయి కొంగు పట్టుకు తిరుగుతాడు అని తల్లి బాధ, తనని మర్చిపోయాడని, ఒక రకమైన ఇన్‌సెక్యూరిటీ ఫీలింగూ..."

మాట్లాడలేదు కమలమ్మ.

"నిజమేరా శ్రీ!" అన్నారు రామారావుగారు.

* * *

గతంలో నుంచి వాస్తవంలోకి వచ్చాడు శ్రీకర్. లక్ష్మి వంటగదిలో పనిచేసుకుంటున్నది.

శ్రీకర్ తన కూతురు స్వప్నకి తన గతమంతా మరొకసారి చెప్పాడు. స్వప్నకి రేపు పెళ్లి చూపులు. స్వప్న తన పెళ్లి బాధ్యత తన తల్లితండ్రులకే వదిలేసింది. మర్నాటి పెళ్లిచూపుల కోసం తండ్రి శ్రీకర్ కూతుర్ని మానసికంగా తయారు చేస్తున్నాడు.

"స్వప్నా! అసలు ఇదంతా నీకు ఎందుకు చెప్పానో తెలుసా?"

"ఎందుకు నాన్నా?" అడిగింది.

"దాదాపు పాతిక సంవత్సరాల కిందటి కొందరిలో ఎంతో స్వార్థం, సంకుచితం చాలా తక్కువ బుద్ధులూ ఉండేవి. నా అనుభవంలోనే అలాంటివి ఎన్నో జరిగాయి. ఇప్పుడు... నీ పెళ్లి బాధ్యత మా మీద పెట్టావు. రేపు నిన్ను చూసుకునేందుకు పెళ్లివారు వస్తున్నారు. అబ్బాయి కుటుంబం గురించి, అతని చదువూ, ఉద్యోగం, వివరాలు నీకు చెప్పాను. మీ ఇద్దరూ ఒకరికి ఒకరు నచ్చితే ఈ పెళ్లి కుదురుతుంది. మీరు ఇద్దరూ ఒకవేళ ఏదైనా మాట్లాడుకుంటే నీకు చెబుతున్నాను.. కొత్త విజ్ఞత, సంస్కారంతో మాట్లాడుకుంటే బాగుంటుంది. 'నేనూ, నాకూ' అని కాకుండా 'మనమూ, మనదీ' అనుకుంటే సమస్యలు ఉండవు. మనిషికి తన చదువూ, సంపాదన, తన కెరియర్, తన పెళ్లి, తన జీవితం... ఇదే ఆలోచన.... తనని అంత ఎత్తుకి ఎదగడానికి ఆరాటపడిన తమని కన్నవాళ్లని గురించిన ఆలోచన అసలు ఉండటం లేదు. మానవతా దృష్టి ఉండటం లేదు. జీవితంలోని విలువలు తెలుసుకోవడం లేదు.

"తల్లిదండ్రులు ఎన్నో కష్టాలూ, ఇబ్బందులూ, ఎన్నో దాటుకుంటూ పిల్లల కోసం భరించి, వాళ్లని పెంచి పెద్ద చేస్తారు. పిల్లలు, పెద్దవాళ్లు అయిన తరువాత, తమ తల్లితండ్రుల గురించి ఆలోచించితే తప్పేమిటి...? అవసరమైనప్పుడు... వాళ్ల కోసం సమయమూ, డబ్బూ ఖర్చుపెట్టాల్సి వస్తే బాధ పడటం ఎందుకు? ఇవ్వాళ్టి రోజున పెళ్లిళ్లు చేసుకుంటున్న కొందరు అమ్మాయిలూ, అబ్బాయిలూ కూడా స్వార్థం పెంచుకుని తమ దారి తాము చూసుకుంటున్నారు. వీళ్లంతా ఏరు దాటాకా, తెప్పతగలేసే రకం. మానవత్వం కొంచెం కూడా లేని మనుష్యులు. నువ్వు అంత సంస్కారహీనురాలివి కాకూడదు స్వప్నా!"

"ఎందుకు ఇదంతా దానికి చెబుతున్నారు?" వంటగదిలో నుంచి వచ్చి కూర్చున్న లక్ష్మి అడిగింది.

"నువ్వు ఉండు లక్ష్మీ! నన్ను చెప్పనియ్యి. చూడు స్వప్నా! అందరూ మీ అమ్మలాగా ఉద్యోగాలు మానుకుని అత్తమామలకీ, మొగుడికీ, ఇంకెవరికో సేవలు చేసి, త్యాగశీలురు కానక్కరలేదు. అసలు వ్యక్తిత్వంలోనే మానవతా విలువలు పెంచుకోవాలి. సంస్కారం పెంచుకోవాలి. మనిషి మనిషిలా ప్రవర్తించాలి, ఆలోచించాలి - మానవ సంబంధాలూ, వాటి విలువలూ గ్రహించాలి. అంతే స్వప్నా నేను చెప్పేది. నీ ఉద్యోగం, నీ కెరియల్, నీ జీవితం.. ఇవే కాదు సంసారంలో మంచి వ్యక్తిత్వంతో నలుగురితో కలిసి మంచిగా బ్రతకటం కూడా జీవితంలో నీ కెరియర్‌లో ఓ ముఖ్యమైన భాగమే... ఇదే నేను నీకు చెప్పాలనుకున్నాను" అన్నాడు శ్రీకర్.

మౌనంగా వింటూ కూర్చుంది స్వప్న తండ్రి చెప్పినదంతా.

"అలాగే నాన్నా! నువ్వు చెప్పిన దాంట్లో యదార్థముంది. తప్పకుండా ప్రయత్నం చేస్తాను" అన్నది.

"పదండి... భోజనాల టైము అయింది" అన్నది లక్ష్మి అక్కడి నుంచి లేస్తూ. శ్రీకర్, స్వప్న లక్ష్మిని అనుసరించారు.



## ఇష్టంలేని బేరం

ఈమధ్య సినిమాల జోరు తగ్గిన స్నేహని మీ పెళ్లెప్పుడూ అని అడిగితే- 'జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డు గెల్చుకున్నాక సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకుంటున్నాను. సినిమాలకు స్వస్తి పలికిన తర్వాతే నా పెళ్లి' అంటోంది. ఈ లెక్కన ఆమెకు అవార్డు వచ్చేదెప్పుడు? సినిమాలకు గుడ్‌బై చెప్పేదెప్పుడు? పెళ్లి చేసుకునేదెప్పుడు? అయినా ఇష్టం లేని బేరమాడ్డం అంటే ఇది కాదూ... అడిగిన ప్రశ్నకు డొంకతిరుగుడు జవాబివ్వడమంటే ఇదేనేమో!